ఆదివాసి సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా

స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దొంకాడ శివప్రసాద్

విశాలాంధ్ర-జి.కె.వీధి : ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసులతోనే నియామకం చేయాలని జీవో ఎమ్మెస్ నెంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయంగా జీవోను తీసుకొచ్చి ఆదివాసి షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉద్యోగాల నియామక చట్టం చేసి ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసులతోనే నియామకం చేపట్టాలని ఆదివాసీ ఆయన డొంకడా శివప్రసాద్ పేర్కొన్నారు. జీ.కె.వీధి విలేకరులతో అయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలంటూ వైసిపి ప్రభుత్వం ఆదివాసీ పక్షపాతి అంటూ నట్టేంట ముంచిందన్నారు. ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగాల నియామకం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారంగా విరుద్ధంగా ఉందని చెప్పి జీవో ఎమ్మెస్ నెంబర్ 3 ని సుప్రీంకోర్టు రద్దుచేసిన విషయం అందరికీ తెలిసిందే నన్నారు. దాని స్థానంలో వైసిపి రాష్ట్ర ప్రభుత్వంగానీ, ఆదివాసి ఎంపీ, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులుగాని ఎటువంటి జీవోను తీసుకోరాక పోవడంతో నేడు వివిధ ఉద్యోగాల భర్తీలో ఆదివాసిలకు పోస్టులు లేకపోవడంతో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికార పార్టీలో ఉన్న ఆదివాసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మౌనం వెనకాల ఆదివాసులకు శాపంగా మారనున్నది. కావున రానున్న ఎన్నికల్లో వైసీపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని మా ఓటుతో సాగనంపుతామని ఆదివాసీ నిరుద్యోగులు అందరి తరపున హెచ్చరిస్తున్నా మన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, జీవో ఎమ్మెస్ నెంబర్ 3ని పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసులతోనే నియామకం చేయాలి. ఆదివాసి మాతృభాష విద్య వాలంటీర్లను రెన్యూవల్ చేసి కొనసాగించాలని అయన అన్నారు.

ప్రతిఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండలంలో గల అతి మారుమూల పంచాయితీ బుంగాపుట్టు పంచాయితీ పరిధిలో గల ప్రజలు రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతిఒక్కరు మీ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ రఫీజాన్ జిమాడుగుల సిఐ ఎస్.రమేష్‌లు అన్నారు. గురువారం మారుమూల పంచాయతీ బుంగపుట్ పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ బూత్ ని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో మార్చడం జరిగింది ఆ ప్రజలకు తెలియజేశారు. ఓటు హక్కు వినియోగంపై పంచాయతీ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తాసిల్దార్ రఫీ జాన్ మాట్లాడుతూ బుంగపుట్ పంచాయతీ లోఓటు హక్కు కలిగిన ప్రజలకు లక్ష్మీపురం వచ్చి ఓటు వేసేందుకు నాలుగు జీపులు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు నిర్భయంగా ధైర్యంగా నేరుగా ఎలక్షన్ బూతు వద్ద వచ్చి ఓటును వినియోగించుకోవాలని పలు సూచనలు సలహాలు అందించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎలక్షన్ బూతులో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు వేసేందుకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో నాలుగు జీపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు ప్రజలు దీన్ని గమనించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని వారు ప్రజలకు వివరించారు. బుంగపుట్ పంచాయతీ కేంద్రం నుండి లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ఎలక్షన్ బూతు ప్రజలందరూ అవగాహన కలిగి ఓటు హక్కును వినియోగించుకోవాలని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ జర్రెల నోయిన ఎస్ఐ కె రవీంద్ర రెవిన్యూ ఇన్స్పెక్టర్ వి రవికుమార్ గ్రామ సచివాలయాల సిబ్బంది రెవిన్యూ శాఖ పోలీస్ శాఖ ఆ పంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాగా చదివి ఉత్తమ స్థాయికి ఎదగాలి... కలెక్టర్ విజయసునీత

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : బాల సదన్‌లో ఆశ్రయం పొందుతున్న బాలికలందరూ చదువులో బాగా రాణించి ఉత్తమ స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఎం.విజయ సునీత ఆకాంక్షించారు. గురువారం స్థానిక తలారిసింగి దరి బాల సదన్ సందర్శించిన కలెక్టర్ బాలికలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు ప్రశ్నలు వేసి సమాదాలు రప్పించారు. వారితో ఆటలు ఆడించి, పాటలు పాడించి వారితో ఆత్మీయంగా గడిపి వారిలో నూతన ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని నింపారు. బాలికలను భూమి మీద ఉన్న నక్షత్రాలుగా, వెల్లివిరిసిన ఇంద్రదనుస్సుగా, అందమైన ఎగరలేని సీతాకోక చిలుకలుగా అభివర్ణించారు. ఇటీవల బాల సదన్ కు మంజూరైన రెండు వాషింగ్ మెషిన్లను, ఒక ఫ్రిడ్జ్, స్మార్ట్ టివి, కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కించారు. అదేవిధంగా బాల సదన్ లో ఆశ్రయం పొందుతున్న బాలికలందరికీ, ఒక ట్రంక్ పెట్టె, మగ్గు, బకెట్, చాప, నెలవారీ ఉపయోగపడే, టూత్ పేస్టు, ఆయిల్స్, ఇతర వినిమయ వస్తువులతో కూడిన కిట్లను కలెక్టర్ బహూకరించారు. అనంతరం బాల సదన్ ప్రాంగణం అంతా కలియ తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి. పద్మావతి, ఐసిడిఎస్ పిడి ఎన్. సూర్యలక్ష్మి, సూపెర్వైజర్ ఊర్మిళ, వేణు, బాల సదన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

వారపు సంతలో మన ఓటు... మన భవిష్యత్తు అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రజాస్వామ్యం ప్రజల చేతులలో ఉంది, అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకొని ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత 18 ఏళ్ల నుండి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరిపై ఉందని తహశీల్దార్ టి రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని లంబసింగి, తాజంగి వారపు సంతలలో రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ సాగిన చిన్నయ్య పడాల్ ఆధ్వర్యంలో మన ఓటు మన భవిష్యత్తు కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మన ఓటు మన భవిష్యత్తు, ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని నినాదాలు చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకొని గిరి గ్రామాల అభివృద్ధికి తోడ్పడవలసిన అవసరం ఆసన్నమైందన్నారు. మే నెల 13న ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా తమ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పద్మ, నాగమణి, పంచాయతీ కార్యదర్శులు గోవింద్, కె పూర్ణచంద్రావు, పాఠశాల ఉపాధ్యాయులు కేపీ రాజు, విద్యార్థిని, విద్యార్థులు, వివిధశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘాట్‌లో లోయలోకి దూసుకుపోయిన బొలెరో

ఇద్దరు మృతి, 27 మందికి గాయాలు

విశాలాంధ్ర-పాడేరు: పొట్ట చేతబట్టుకొని కుటుంబ పోషణ కోసం గన్నవరం కూలీపనుల నిమిత్తం వలస వెళుతున్న వారిలో ఇద్దరిని బొల్లెరో రూపంలో మృత్యువు కబళించింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా పలువురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఆంధ్రా సరిహద్దు ప్రాంతం నుండి విజయవాడ కూలీపని కోసం వలస వెళుతున్న బొల్లెరో వాహనం బుధవారం రాత్రి పాడేరు ఘాట్లో బోల్తాపడింది. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బాడెంవలస గ్రామానికి చెందిన 27 మంది జొన్నలు ఏరడం కోసం విజయవాడ సమీపంలోని గన్నవరం బయలుదేరారు. పాడేరు ఘాట్లోని కోమాలమ్మ పనుకు ఏసుప్రభువు మలుపు మధ్యలో బొలెరో వాహనం అదుపు తప్పి ఎడమవైపు లోయలోకి దూసుకుపోయింది. ఈఘటనలో 17 ఏళ్ల బాలిక అక్కడికక్కడే మృతి చెందగా, పాడేరు ఆసుపత్రికి తరలిస్తుండగా మరొక వ్యక్తి మృతి చెందాడు. క్షతగాత్రులను నాలుగు వాహనాల ద్వారా పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న ఐదుగురిని విశాఖపట్నం కేజీహెచ్ కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిర్మూలనకు కృషిచేసిన పోలీసు ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర-చింతపల్లి : ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా గంజాయి నిర్మూలనకు కృషి చేసిన, చేస్తున్న పోలీసు ఉద్యోగులకు అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో చింతపల్లి, కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ లు రమేష్, రమణ, చింతపల్లి, అన్నవరం, కొయ్యూరు సబ్ ఇన్స్పెక్టర్ లు అరుణ్ కిరణ్, రమణ, రాజారావు, రామకృష్ణలు ఉన్నారు. ఇటీవలి కాలంలో గంజాయి కేసులలో ప్రతిభ కనబరచినందుకు గానూ వీరందరిని అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నగదు, ప్రశంసా పత్రాలతో అభినందించారు.

స్వతంత్ర అభ్యర్థిగా సుంకరి విష్ణుమూర్తి

విశాలాంధ్ర-సీలేరు : పాడేరు నియోజకవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీకి టికెట్టు ఉంటుందని, పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు ఆశించారు. సిపిఐ, సిపిఎం కాంగ్రెస్ పొత్తుల భాగంలో సిపిఎంకు పార్లమెంటు ఎంపి, కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే ఇవ్వడంతో సిపిఐ సీనియర్ నాయకులు ముఖ్య కార్యకర్తలు చాలా ఒత్తిడికి గురయ్యారని సుంకరి విష్ణుమూర్తి అన్నారు. పాడేరు నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీకి అత్యధిక మెజార్టీ ఓట్లు ఉన్న నియోజకవర్గం పాడేరు. ఈ నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీకి టికెట్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్నప్పుడి నుండి భారత కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుడిగా పార్టీ పనిచేస్తున్నప్పటికీ అల్లూరు జిల్లాలో కార్యవర్గంలోనే ఉంటూ నిత్యం ప్రజలతో ప్రజా సమస్యలతో మమేకమై ఉన్నానని, 2019 ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ జనసేనతో ఎలక్షన్లో వెళ్లడం వల్ల కమ్యూనిస్టు పార్టీకి చాలా నష్టం జరిగిందన్నారు. 2024లో కూడా కాంగ్రెస్‌తో పొత్తు కలవడం కమ్యూనిస్టులకు చాలా నష్టం ఉంటుందన్నారు. ఈప్రాంత ప్రజలందరూ నాకు సహకరిస్తారని, నేను పాడేరు నియోజక వర్గ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ఒక ప్రకటనలో విష్ణుమూర్తి పేర్కొన్నారు.

ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ సందర్శన

విశాలాంధ్ర-అరకులోయ: మండలంలోని భీముడు వలస, యండపల్లివలస ఎంపీపీ పాఠశాలను మండల విద్యా శాఖ అధికారి తాంగుల మోహన్ రావు గురువారం ఉదయం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్య పై ఆరా తీశారు. వర్క్ బుక్స్ పరిశీలించి విద్యార్థులచే చదివించారు. ఉపాధ్యాయులు తప్పని సరిగా వర్క్ బుక్స్ పరిశీలించి తప్పుఒప్పులను సరి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఐటిడిఏ పిఓ గనోరే

విశాలాంధ్ర-మారేడుమిల్లి : ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం మారేడుమిల్లి మండలంలోని బొదులూరు, మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పర్యటించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ ఈ సంవత్సరం మలేరియా జ్వరాలు ప్రబలకుండా ప్రతి గ్రామములో ప్రతి ఇంటికి వెళ్లి మలేరియా ఫీవర్లు సర్వే చేయాలని అదేవిధంగా ప్రతి ఇంటికి మలేరియా దోమలు నివారణ కొరకు మలేరియా స్ప్రింగ్ చేయించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు, మలేరియా రక్త నమోనాలకు సంబంధించిన కిట్లు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టుకోవాలని అదేవిధంగా ఎవరైనా జ్వరాలతో వచ్చిన రోగులను వెంటనే రక్త పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆయన అన్నారు, ప్రతిరోజు ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంతమంది రోగులు వచ్చుచున్నది ఆయన ఆరా తీశారు, ఈరెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది అదేవిధంగా ఎంతమంది ప్రమాదకర గర్భిణీలు ఉన్నది గుర్తించాలన్నారు. ఎంతమంది గర్భిణీ స్త్రీలు బర్త్ వెయిటింగ్ హాల్లో ఉన్నది ఆయన ఆరా తీశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని ఆయన అన్నారు. ఈ రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించడం జరిగింది. మారేడుమిల్లి గ్రామంలో వైద్యాధికారులకు నిర్మిస్తున్న వసతి గృహాలు, హెల్త్ బ్లాక్ యూనిట్ పనులను ఆయన పరిశీలించడం జరిగింది అదేవిధంగా వైద్యాధికారుల వసతి గృహాలు, హెల్త్ బ్లాక్ యూనిట్లు పనులు వేగవంతంగా చేసి ఈ భవనాలు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆయన ఆదేశించారు, పిఓ వెంట ఏడియం&హెచ్ ఓ జి. ప్రకాశం, వైద్యాధికారులు హరికృష్ణ, సంతోష్, రాణి శిరీష, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, చైతన్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రదీప్, భాను తదితరులు పాల్గొన్నారు,

అల్లువాడ నుంచి ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర-కురుపాం : 2024సాదారణ ఎన్నికలకు సంబంధించి ఆనవాయితీగా జియ్యమ్మవలస మండలం అల్లువాడ నుంచి గురువారం తన ప్రచారాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు ఆధ్వర్యంలో మాజీ ఉపముఖ్యమంత్రి, సిటింగ్ ఎమ్మెల్యే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్నా అభివృద్ధి కేవలం ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలన లో చేసి చూపామని, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా నియోజకవర్గంలో ఐదు మండలాల పరిధిలో ప్రతీ ఇంటిక సంక్షేమ పథకాలు అందించటం జరుగుతుందని అన్నారు. ఈ ఎన్నికలలో హ్యాట్రిక్ విజయం సాధించేందుకు సమన్వయంతో అందరూ పనిచేయాలని పరీక్షిత్తు రాజు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు క్షుణ్ణంగా అధ్యయనంచేసి అభివృద్ధి చేసి చూపిన తనలాంటి సమర్థవంతమైన నాయకత్వం కావాలో అసమర్థుడు కావాలో ప్రజలే నిర్వహించుకోవాలని సూచించారు. అఖండ విజయం సాధించీ భవిష్యత్తులో జగన్మోహన్ రెడ్డి రెండోసారి పరిపాలన ప్రారంభించిన అనతి కాలంలోనే అభివృద్ధి మరింత పరుగులు పెట్టిస్తామని అన్నారు.తెలుగుదేశంపార్టీ మోసపూరిత హామీ పథకాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఐదు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరూ పాటుపడాలి

ఫారెస్ట్ రేంజర్ రామారావు

విశాలాంధ్ర-సాలూరు రూరల్: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఫారెస్ట్ రేంజర్ కె.రామారావు అన్నారు.మండలంలో మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపి ఎన్‌జిసి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫారెస్ట్ రేంజర్ కె.రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరూ పాటు పడాలని, ఇది అందరి బాధ్యత అన్నారు. విద్యార్థి దశనుండే పర్యావరణపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణానికి హాని తలపట్టే పనులను విడనాడాలన్నారు. భూగర జలాలు క్రమేపీ తగ్గిపోతున్నాయన్నారు. నీటిని, నేలను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటువలన నీటిని సంరక్షించవచ్చు అన్నారు. అలాగే అటవీ హక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటు నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. విజేతలకు సాలూరు రేంజ్ అటవీశాఖాధికారి రామారావు చేత బహుమతి ప్రధానం చేయించారు.వ్యాసరచన పోటీలలో శ్రీధర్, శృతి, వక్తృత్వ పోటీలలో రాజ్యలక్ష్మి, చరిష్మాలు ప్రథమ,ద్వితీయ స్థానాలలో నిలిచారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగించేలా నినదిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏపి ఎంజీసీ సాలూరు కోఆర్డినేటర్ డి.ప్రసన్నకుమార్, సైన్స్ ఉపాధ్యాయులు మంచాల ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

30 లీటర్ల నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-పాచిపెంట : 30 లీటర్ల నాటు సారా తో పాచిపెంట గ్రామానికి చెందిన చోడుగింజలు చిన్నారావు అనే వ్యక్తి నాట్ సార తరలిస్తుండగా బుధవారం పొట్టుబడినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. కేసు నమోదు చేసి గురువారం కోర్టుకి తరలించినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఈ దాడిలో ఏ ఎస్ ఐ మురలియ్య తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు

ఎన్నికలు నిబంధనలు ఉల్లంఘించిన అంబులెన్సు డ్రైవర్ తొలగింపు

విశాలాంధ్ర-కురుపాం : ఎన్నికల సంఘం నిబంధనలు పాటించకుండా ఉల్లంఘన కు పాల్పడిన కొమరాడ మండలం మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్సు డ్రైవర్ ను విధుల్లో నుంచి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పటిష్టంగా అమలు చేయాలని ఏఒక్క ప్రభుత్వ ఉద్యోగి రాజకీయ పార్టీలు, నాయకులతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

ఐజీ మున్సిపల్ పాఠశాలను ఎంఈఓ సందర్శన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మున్సిపల్ పరిధిలోని ఇందిరా గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను పార్వతీ పురం మండల విద్యాశాఖ అధికారి 1 సామల సింహాచలం గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ఆంగ్ల, తెలుగు పాఠ్యాంశాలను చదివించారు. అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. చిన్నారుల చేతి రాత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉన్న దృష్ట్యా విద్యార్థులను బయటకు పంపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులు డీ హైడ్రేషన్ బారిన పడకుండా వాటర్ బెల్ అమలు చేసి విద్యార్థులకు మంచినీరు త్రాగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాసనసభ ఎన్నికల్లో తనకు ఓటును వేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించండి

వైఎస్సార్సీపీ అభ్యర్థి జోగారావు విజ్ఞప్తి

విశాలాంధ్ర-సీతానగరం : రాష్ట్రంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి గతఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలనుచూసి వైఎస్సార్సీపీకు ఓటువేసి వైఎస్ జగన్మోహన్రెడ్డిని రెండోసారి సీఎంగా, తనకు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని సిటింగ్ ఎమ్మెల్యే,పార్వతీపురం వైఎస్ఆర్సిపి అభ్యర్థి అలజంగి జోగారావు తెలిపారు. గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని సూరమ్మపేట గ్రామంలో నిర్వహించారు. నియోజకవర్గంలో గతఐదేళ్లుగా యెనలేని అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. అందరికీ 24గంటలపాటు అందుబాటులో ఉండి ప్రజల కష్ట సుఖాల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు రెండోసారి అవకాశాన్ని ఇవ్వాలని ఆయన ఇంటింటికి వెళ్ళి అవ్వాతాతలని, అక్కాచెల్లెళ్ళను , యువతీ యువకులను, వయోజనులను, వికలాంగులని, వృద్ధులను కలిసి ఓటును వేయాలని కోరుతున్నారు. ఈతెల్లవారు జామునుండి రాత్రివరకు నేరుగా ఆయనే ఇంటింటికి వెళ్ళి ప్రజలను, ఓటర్లను కలసి విజ్ఞప్తి చేస్తున్నారు.పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటిసి మామిడి బాబ్జి, వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి పోల ఈశ్వరనారాయణ, పి ఎస్ ఎన్,సర్పంచ్ సూరందొర, సహకార సంఘం అధ్యక్షుడు మండల త్రినాథ్, రమేష్,మాజీ సిడిసి ఛైర్మన్ రామక్రిష్ణ, ధనంజయ నాయుడు,నారాయణరావు, గొంగడ లక్ష్మణ,గోపాల్ , మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం చేస్తున్నామని తెలిపారు. బలిజిపేట మండలంలోని జెడ్పీటీసీ అలజింగి రవికుమార్, ఎంపిపి ప్రతినిది జగన్మోహన్, వైస్ ఎంపిపి వెలిదిసాయి, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మురళీ కృష్ణ తదితరులు ప్రచారాన్ని నిర్వహించారు.పార్వతీపురం పట్టణంలో , గ్రామీణ ప్రాంతంలో కూడా ప్రచారాన్ని పార్టీనేతలు, ప్రజాప్రతినిదులు నిర్వహిస్తున్నారు.ముమ్మరంగా పలు ఇళ్ళకు పరామర్శకోసం , వివిద శుభ కార్యక్రమాల్లో పాల్గొనడం కూడా చేస్తున్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో నాయకులు చాలా వరకు వ్యక్తిగతంగా ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టంగా కనిపిస్తుంది.

మనవడు ఇన్నోవేషన్... నాయనమ్మకు నో పరేషాన్

విశాలాంధ్ర-కురుపాం : ఓం గిరి శిఖరం గ్రామానికి చెందిన యువకుడుకి వచ్చిన గొప్ప ఆలోచన వృద్ధాప్యంలో తన నాయనమ్మకు ఎలాంటి పరేషాన్ లేకుండా హాయిగా పనులు పూర్తిచేసుకునే సౌకర్యమైంది. లోవముతాలోని గుమ్మలక్ష్మీపురం మండలంలోని గిరిశిఖరంపై ఉన్న దిగువ చోరుపల్లి గ్రామానికి చెందిన మండంగి చిన్నమ్మాయి(75) వృద్ధాప్యం కారణంగా కాళ్ళు సరిగా వెసులాడక ఏపని చేసుకోవాలన్నా, ఎక్కడకి వెళ్ళాలన్నా తీవ్ర ఇబ్బందులు పడేది. సమస్య గుర్తించిన మనవుడు మండంగి శివ(26) తనకున్న ద్విచక్ర వాహనంనకు రెండు చక్రాల ట్రాలీ తయారుచేసి అమర్చి అందులో నాయనమ్మ మండంగి చిన్నమ్మికి కూర్చోబెట్టి అవసరమైన చోటుకు సునాయాసంగా తరలించి పనులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పూర్తి చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేయగా వచ్చిన డబ్బులు ఎపి వికాస్ గ్రామీణ బ్యాంకు నుంచి తీసుకునేందుకు కురుపాం వచ్చిన సందర్భంగా విశాలాంధ్ర కంటపడింది. వినూత్నంగా ఉన్న వాహనంచూసి వివరాలు ఆరా తీస్తే అసలు విషయం తెలిసింది. పరిశోధనాత్మక ఆలోచన ఎలా వారు వాటిని సక్రమంగా అమలుచేస్తే ఇలాంటి వందల అవసరాలను సునాయాసంగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. నాయనమ్మపై ఉన్న అభిమానం తనలో ఆలోచనకు బీజం పడేలా చేసిందని శివ తెలిపారు. ఎంతదూరమైన, కొండలపై కూడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రయాణం చేయగలుగుతున్నామని ఆయన తెలిపారు. తనవద్ద ఉన్న పాత చక్రాలు, కర్రలు, మంచం పట్టితోనే ట్రాలీ తయారుచేసి పైన దుప్పటి కట్టడాన్ని తెలిపారు.

ఈనెల 6న విద్యుత్ సరఫరా నిలుపుదల

పాడేరు డివిజనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి అప్పారావు

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల పరిధిలోని 33 కెవి విద్యుత్ మరమ్మతు చేపట్టందుకు గాను ఈనెల 6న విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని పాడేరు డివిజనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి ఏవిఎస్ఎమ్ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని మరమ్మత్తు పనులు చేపట్టేందుకు శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ మరమ్మత్తు పనులు చేపట్టడంతో పోలింగ్ రోజున విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళిక ద్వారా విద్యుత్ సరఫరాకు అన్నివిధాలుగా ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 6న విద్యుత్తు నిలుపుదల నిర్వహించడం జరుగుతుందని, చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సిఐ పరిశీలన

విశాలాంధ్ర-కొమరాడ : గురువారం విక్రమ్‌పురం పరుశురపురం మార్కొండ పుట్టి దుగ్గి గుణాలపురం సివిని పోలింగ్ కేంద్రాల్లో పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 13వ తేదీ పోలింగ్ జరుగుతుందని ముందస్తుగా పోలింగ్ కేంద్రాలకు వద్ద ఎన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ప్రజలకు ఓటేసినందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు ఎలా ఉనయో ఉన్నంత అధికార ఆదేశాల ప్రకారం పరిశీలించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొమరాడ ఎస్సై కే.నీలకంతం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పించన్ల పంపిణీని ఎంపీడీఓ, ఈఓపిఆర్డీ పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గురువారం పింఛన్ల పంపిణీను అధికారులు దగ్గరుండి పరిశీలించి ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాలను సచివాలయ సిబ్బందికి తెలియజేస్తూ లక్ష్యాలు పూర్తిచేసేందుకు కృషిచేశారు. బుదవారం రాత్రినుండి ప్రారంభించి గురువారం సాయంత్రంనాటికి 90శాతం పింఛన్ల పంపిణీజరిగినట్లు ఎంపీడీవో ఈశ్వరరావు, ఈఓపిఆర్డీ కుమార్ వర్మలు తెలిపారు. అన్నిసచివాలయాల్లో సచివాలయసిబ్బంది దగ్గరుండి పెన్షన్లను పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు వృద్ధులు, వికలాంగులు, మంచంపై ఉన్నవారిఇళ్లకు వెళ్లి పింఛన్లను రెండు చేతులతో అందించారని చెప్పారు.

90 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి : ఎంపిడిఓ లక్ష్మీకాంత్

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో బుధవారం సాయంత్రం నుండి గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు 90 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో పున్నప లక్ష్మీకాంత్ తెలిపారు. మండలంలో 69 59 పెన్షన్లకు గాను గురువారం సాయంత్రం ఐదు గంటల సమయానికి 62 67 పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు .సచివాలయ సిబ్బందితోపాటు ఎంపీడీవో లక్ష్మీకాంత్ పెన్షన్ల పంపిణీ చేపట్టారు ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

53.9 శాతం సామాజిక పెన్షన్ పంపిణీ : ఎంపీడీవో

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని 9623 మంది పెన్షన్ లబ్ధిదారులకు గాను ఇప్పటివరకు 5109 మంది లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో వి వీర సాయిబాబు అన్నారు. ఈవోపీఆర్ శ్రీనివాస్ తో కలిసి ఆయన లంబసింగి, తాజంగి, గొందిపాకల, కిటుముల, కొత్తపాలెం పంచాయతీలను సందర్శించి పెన్షన్ పంపిణీ తీరుపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు చేరవేయవలసిన సామాజిక పెన్షన్ ని రెండు రోజులలో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటివరకు 53.9% పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన పెన్షన్ లబ్ధిదారులు ఎవరూ ఇబ్బందులు పడవలసిన అవసరం లేదని, నేరుగా గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కే శ్రీనివాస్ రావు, గోవింద్, పూర్ణచంద్రరావు, కే శివకుమార్, బి హేమకాంత్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

డిఎంఓ డాక్టర్ జగన్‌మోహనరావు సూచన

విశాలాంధ్ర-బెలగాం : వేసవిలో ప్రబలే ఆరోగ్య సమస్యలకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని డిఎంఓ డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. పార్వతీపురం మండలం ఎంఆర్ నగరంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీల వివరాలు, వైద్య పరీక్షలు పరిశీలించారు. అక్కడ ఓఆర్ఎస్ ప్యాకెట్లు లభ్యతను పరిశీలించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు కారణంగా శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందని, తద్వారా కూడా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, కాబట్టి క్షేత్ర స్థాయిలో గానీ, ఆరోగ్య కేంద్రాల్లో గానీ జ్వరాలు గుర్తించేటప్పుడు మలేరియా, డెంగ్యూ సంబంధిత జ్వరమా లేదా డీహైడ్రేషన్, వడదెబ్బ, ఇతర కారణాల అని వెంటనే నిర్ధారణ చేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ ఎండతీవ్రత వల్ల శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందని, అశ్రద్ధ చేస్తే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని కాబట్టి ఎండతీవ్రత సమయంలో బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదని, ఎల్లప్పుడూ అందుబాటులో త్రాగు నీరు ఉంచుకోవాలన్నారు. కోల్పోతున్న నీటి శాతాన్ని ఎప్పటికప్పుడు నీరు, నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్ల మొదలగు ద్రావణాలు తీసుకోవడం ద్వారా భర్తీ చేయాలన్నారు. ఎక్కువగా శాఖాహారం తీసుకోవా లని, శరీరాన్ని డీహైడ్రేట్ చేసే టీ, కాఫీ, కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్, నూనె వంటలు, ఎక్కువ కారం, ప్రోటీన్, క్రొవ్వు కలిగిన ఆహార పదార్థాలు మానుకోవాలన్నారు. వడదెబ్బకు గురయ్యే సమయంలో తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, పాక్షికంగా అపస్మారక స్థితి మొదలగు లక్షణాలు ఉంటాయని, వెంటనే దగ్గర్లో చల్లని ప్రదేశానికి తీసుకువెళ్ళి, తడి గుడ్డతో శరీరాన్ని రుద్దుతూ ఉండాలని, స్పృహలో ఉన్నప్పుడు మాత్రమే నీరు మొదలగు ద్రావణాలు త్రాగించాలని, సాధారణ స్థితికి రాని యెడల దగ్గర్లో ఉన్న ఆరోగ్య కేంద్రానికి, ఆసుపత్రికి తరలించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవి జాగ్రత్తల పట్ల సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి. అనూష, ఆరోగ్య కార్యాలయ డెమో వై. యోగీశ్వరరెడ్డి, సూపర్ వైజర్లు సత్తిబాబు, శంకరరావు, వైద్య సిబ్బంది నందిని, పోలమ్మ, బంగారునాయుడు, 104 సిబ్బంది కిరణ్, కోటీశ్వరరావు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఐసీడీఎస్ పిఓ సుగుణకుమారి అకాల మరణం

విశాలాంధ్ర-సీతానగరం : సీతానగరం, బలిజపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ సిహెచ్ సుగుణకుమారి(54) గురువారం సాయంత్రం అకాల మరణం చెందారు. గత మూడు రోజులుగా తలనొప్పితో బాధపడుతున్న విధులకు హాజరవుతున్నారని సిబ్బంది తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఆమె పాల్గొన్నారని సిబ్బంది తెలిపారు. ఒక్కసారి విపరీత తలనొప్పి రావడంతో విజయనగరం ఆసుపత్రికి వెళ్తూ మార్గమధ్యలో మృతిచెందారు. ఆమె సూపర్‌వైజర్‌గా ఉంటూ గత ఏడాది రెగ్యులర్ పీఓగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందాక కొత్తగా ఏర్పాటుచేసిన బలిజిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుకు మొదటి పిఓగా బాధ్యతలను చేపట్టి గతఏడాదిగా అందరితో కలిసి ఉంటూ మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఐసీడీఎస్ కార్యక్రమాల్లో, ప్రభుత్వ కార్యక్రమాల్లో, జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో జరిగిన కార్యక్రమాల్లో రెండు మండలాల్లో అన్ని సచివాలయంలో జరిగిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. పౌష్టికాహారం, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించడంలోఆమె ప్రత్యేకశ్రద్ధ తీసుకొన్నారు. ఇటీవల కలెక్టర్ రూపొందించిన ప్రిజం కార్యక్రమం లో కూడా ఆమె చురుగ్గా పాల్గొని రక్తహీనత నివారణ కోసం అవగాహణ కల్పించారు. ఐసీడీఎస్ సిబ్బందితో ఎప్పటికపుడు సమావేశాలు నిర్వహించి వారికి అన్ని అంశాలు పట్ల అవగాహణ కల్పించి ఐసీడీఎస్ శాఖ లక్ష్యాలు లబ్ధిదారులకు చేరాలని కోరేవారు. మృతి చెందిన ఐసీడీఎస్ పిఓకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె మృతిపట్ల జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విధ్యారాణి, సీతానగరం, బలిజిపేట మండలాల అధికారులు, ప్రజా ప్రతినిదులు, వైద్యులు, పాత్రికేయులు, రెండుమండలాలకు చెందిన సూపర్ వైజర్లు పూర్ణిమ, సులేఖ, పద్మావతి, 180 అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు, అంగన్వాడి సంఘాల నాయకులు, పలు ఐసీడీఎస్‌ల పిఓలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె సేవలను వారంతా కొనియాడారు.

గ్రామ వాలంటీర్ విధులకు రాజీనామా

విశాలాంధ్ర-వి.ఆర్. పురం. : మండలంలోని, రాజుపేట గ్రామ సచివాలయం పరిధిలోని శ్రీరామగిరి పంచాయతీ, చొక్కనపల్లి గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్ విధులకు సోడే చిరంజీవి రాజీనామ లేఖను ఎంపీడీఓ ఫణింద్ర రెడ్డికి అందజేసారు. వివరలోకి వెళితే అల్లూరి సీతారామరాజు జిల్లా, మండల పరిధిలోని, శ్రీరామగిరి పంచాయతీ, చొక్కన పల్లి గ్రామానికి చెందిన సోడే. చిరంజీవి వాలంటీరు విధులు నుండి 05/04/2024 రోజున ఎవరీ ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా తన నిర్ణయాన్ని మీడియాకి తెలియపరచడం జరిగింది. ఈసందర్భంగా వాలంటీర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామసచివాలయ వ్యవస్థను తీసుకోని వచ్చి, అందులో శాశ్వత ప్రాతి పదికన సుమారు 1,32,000వేల మందికి ఉద్యోగ ఉపాధిని కల్పించారు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా 2,75,000 వేల మందిని నియమించి, ప్రతి 50 కుటుంబా లకు (ఇళ్లకు), 1 గ్రామ, వార్డ్ వాలంటీర్ ని పెట్టి ప్రతి పేదవాడికి ఇంటి వద్దకే పాలన తీసుకొని వచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదే అని చిన్న సర్టిఫికెట్, పెంచన్ కావాలన్నా ప్రజలు ఆఫీసులు చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదంటు ఈరోజు జగనన్న వచ్చాక ఈఐదు సంవత్సరాల్లో వాలంటీర్ ఇంటివద్దకే వచ్చి ప్రతి పేదవాడికి సర్టిపికేట్ ప్రతినెల పెంచన్ ఇంటికే వచ్చి ఉదయం 6గంటలకే డోరుతట్టి ఇచ్చిన ఘనత భారతదేశ చరిత్రలో ఎక్కడలేని విధంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి కే సాధ్యం అయ్యిం దన్నారు. రెండవ సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే చేసుకుంటేనే ప్రతి పేదవాడికి సంక్షేమం, అభివృద్ధి, ఇంటి వద్దకే మళ్ళీ పాలన వస్తుందనీ ప్రతి పేదవాడి కళ్ళలో చిరు నవ్వు ఆనందం చూడాలన్నదే జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం అని ఆయన ఆశయాల మేరకే నేను నా వాలంటీర్ విధులకు రాజీనామా చేశానన్నారు. అలానే రంపచోడవరం నియోజక వర్గంలో మళ్ళీ ఎంఎల్‌ఏగా నాగులపల్లి. ధనలక్ష్మి గెలుపు కోసం నావంతు కృషి చేస్తానన్నారు.

జోగమ్మపేటలో టీడీపి ప్రచార కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం : రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసేందుకు అంతాకష్టపడి పనిచేయాలని, సూపర్ సిక్స్ కార్యక్రమాలను, టీడీపి మినీ మ్యానిఫెస్టో అందరూ గమనించి ఓటు వేయాలని ఉమ్మడి పార్టీల పార్వతీపురం అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మండలంలోని జోగమ్మపేట గ్రామంలో జరిగిన ప్రచార సభకు విచ్చేసిన విజయ్‌చంద్రకు తప్పిట గుల్లతో, పటాస్ సామాగ్రితో ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి కుంకుమబొట్టునుపెట్టి ఆశీస్సులను అందజేసారు. అన్నివీదుల గుండా ఊరేగింపు నిర్వహించి ఇంటింటికివెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు మినీమ్యానిఫెస్టును, ఉమ్మడి పార్టీల అభ్యర్థి విజయ్ చంద్ర వివరించారు. పలువురు టీడీపిలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.టీడీపి- జనసేన, బీజేపి ఉమ్మడి అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో టీడీపి నాయకులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణు, సాల హరిగోపాల్, దామినేని భానుప్రసాద్, బొమ్మినాయిని లక్ష్మణరావు, బొమ్మినాయిని గంగమ్మ, పోలవెంకట నాయుడు, బొమ్మినాయిని శ్రీనివాసరావు, మద్రాపురామకృష్ణ, జాగాన తిరుపతి, రాజాన ప్రకాశ,తెంటు వెంకటఅప్పల నాయుడు, అరవింద్, పారి నాయుడు, బొంగు భాస్కరరావు, రెడ్డి సింహాచలం నాయుడు, ఐడిది శ్రీను, సబ్బాన శ్రీను, గొట్టాపు అప్పారావు, తేరేజమ్మ, వాకాడ పారినాయుడు, తెంటు రామారావు, బలగ శ్రీనివాసరావు, శంకరరావు, రమేష్, కొల్లి సురేష్,ఉడమల సూర్యనారాయణ, భాస్కరరావు, కె.రామకృష్ణ నాయుడు, జక్కుఫకీరునాయుడు, మద్రాపు సత్యనారాయణ, తాన్న సత్యనారాయణ, యోగేశ్వరరావు, బర్ల వెంకటరమణ, ధనంజయ, వాసు, తేలు తిరుపతి, జగన్నాథం, ఎస్ సతీష్, వంజరాపు గుంపస్వామి, బి. శ్రీరాములు, తేలుశేఖర్, సాయి, జనసేన మండల అధ్యక్షులు పి శ్రీనివాసరావు, పైల సత్యనారాయణ, రమేష్ సత్యనారాయణ, కె.ధనంజయనాయుడు, పైల శ్రీనివాసరావు, మణికంట తదితర టీడీపి, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇదిలాఉండగా వివిఎస్ టీమ్ దగ్గరుండి అంతా రికార్డు చేసినట్లు అధికారులు పంచాయతీ రాజ్ డిఈఎం రత్నకుమార్, సీతానగరం ఏఎస్‌ఓఎస్ సతీశ్‌లు చెప్పారు.

మేమంతా సిద్ధం కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : మండలంలో మేము సిద్ధం మా బూతు సిద్ధం మేమంతా సిద్ధం కార్యక్రమం దారెల కిలగాడ పంచాయతీ పరిధిలో నిర్వహించామని మండల వైసీపీ కార్యకర్తలతో మండల పరిషత్ అధ్యక్షురాలు అరిసెల సీతమ్మ మండల వైసిపి అధ్యక్షుడు పి పద్మారావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ దారెల పంచాయితీ లోగల డొక్కిరిపుట్టు పేటమాలి పుట్టు రంగేలి సింగి డీంగూడా పెద్ద పేట కిలగాడ పంచాయతీ మలకర పుట్టు చెరువుపాకల రాయిపల్లి గ్రామాలలో ప్రజలను 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్సీపీ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని వారు తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలు 99% నెరవేర్చారన్నారు మరోసారి ముఖ్యమంత్రి చేయాలంటే వైయస్సార్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి వేగం మచ్చలింగం ఎంపీ అభ్యర్థి డా.గుమ్మ తనుజ రాణి లను ఫ్యాన్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిచచాలని వారు కోరారుఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ వంతాల కొండలరావు సర్పంచుల ఫోరం అధ్యక్షులువెంగడ రమేష్ పెదగుడా సర్పంచ్ మండి బాబురావు వైసిపి పార్టీ నాయకులు తిరుపతిరావు జగన్నాథం బాబురావు పిత్బాస్ రాంప్రసాద్, పులిరాజు దాసు రమేష్, ధనుంజయ పరుశురాం తిరుపతిరావు ధనుర్జై రమేష్ జగన్నాథం పడాల్ అప్పారావు జోగారావు త్రినాథ్ రామారావు అర్జున్‌రావు సుందర్రావు ధర్మారావు జగన్నాథం మాణిక్యం గ్రామ సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

ఓటు హక్కు వినియోగం పై మహిళల్లో అవగాహన : సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

విశాలాంధ్ర-రంపచోడవరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లకు అవగాహన కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తాసిల్దారు వారి కార్యాలయ ప్రాంగణంలో అంగన్వాడి సూపర్వైజర్లతో అంగన్వాడి టీచర్లతో, అంగన్వాడి ఆయాలతో, మహిళా సంఘాల సభ్యులతో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు ఏవిధంగా ఓటు హక్కు ఏవిధముగా వినియోగించుకోవచ్చు ముగ్గుల పోటీల ద్వారా మహిళ ఓటర్లకు అవగాహన కల్పించే విధంగా ఈ రంగోలి పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి తెలిపారు, ఈ సందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈముగ్గుల పోటీలో సుమారు వందమంది మహిళలు వివిధ రకాలలో మహిళలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా రంగురంగులతో అదేవిధంగా జాతీయ పతాకం మూడు రంగుల జెండాతో అందర్నీ ఆకర్షించే విధంగా అందరు మహిళలు మంచి ముగ్గులు వేయడం జరిగిందని అందరికీ ఏదో ఒక ప్రైజ్ ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు అందరికీ ప్రైజులు అందజేయాలని ఆయన తాసిల్దార్ వారిని ఆయన తెలియజేయడం జరిగింది. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు నిర్భయంగా నచ్చిన అభ్యర్థికి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఈ ముగ్గుల పోటీలు (రంగోలి) ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరూ మీ గ్రామాలలో మీ చుట్టు పక్కల ఉన్న మహిళలందరికీ నిర్భయంగా మీకు నచ్చిన అభ్యర్థులకు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని మహిళలను ఆయన తెలిపారు, 18 సంవత్సరాల నిండిన యువతీయువకులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటర్ కార్డులకు దరఖాస్తులు సమర్పించుకోవా లని ఆయన తెలిపారు, 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు కలవని అదేవిధంగా 59 సెక్టార్ అధికారులను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,44 570 మంది కలరని అదేవిధంగా 1,31,088 మంది పురుషులు కలరని అదేవిధంగా థర్డ్ జెండర్ 15 మంది. 3 388 మంది వికలాంగులు,1561 మంది వృద్ధులు ,4249 యువతి యువకులు మొత్తం 11 మండలాల్లో 2 లక్షలు 75 వేల 673 మంది ఓటర్లు 26-3-2024 నాటికి కలరని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం తహసిల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, డిప్యూటీ తాసిల్దార్ బి. రాజు ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎస్వి రమణ, సిడిపిఓ సంధ్యారాణి, సీనియర్ అసిస్టెంట్లు చెల్లాయమ్మ, ఇందిరా బాయ్, వీఆర్వోలు గణపతి, పి.రవి, పి. శ్రీనివాసరావు, సత్యనారాయణ,యం. ఆనంద్, జి. ప్రభాకర్, జి. ఒసేవు, రమాదేవి, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, మహిళాసంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన మాతృశ్రీ గడి బాపనమ్మ ఉత్సవాలు

విశాలాంధ్ర-రంపచోడవరం : రంపచోడవరం మండలంలోని సీతపల్లి గ్రామంలో కొలువైన మాతృశ్రీ గడి బాపనమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు గురువారం నుండి అంగరంగ వైభవం గా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరిగే అమ్మవారి ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. తొలిరోజు గురువారం సోమవారం వరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు ఘనంగా చేస్తున్నారు. ఈ సందర్భంగా తొలిరోజు ఉదయం అమ్మవారికి మహాకుంభం కార్యక్రమం అనంతరం గ్రామ ఆడపడుచులతో సారె సమర్పణ, ఊయల సేవతో మహాచండి హెూమంతో ప్రారంభంఅయినది. ఐదు రోజులు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ అధికారులు నిర్వహించనున్నారు. ఈ మహా కార్యక్రమాలలో ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు సీతపల్లి పరిసర ప్రాంతాల భక్తులు హాజరయ్యారని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగండేపూడి సత్యరమేష్ తెలిపారు. నల్లమిల్లి వేంకటరామారెడ్డి రంపచోడవరం ధర్మ ప్రచార సేవా భక్త మండలి సమన్వయ కర్త తదితరులు పాల్గొన్నారు.

రండి 'అగాపే' ఉజ్జీవ సభల్లో పాల్గొనండి

విశాలాంధ్ర - అరకులోయ : అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండల పరిధిలోని కుర్రాయి కొత్తవలన గ్రామంలో అగాపే ప్రార్థన మందిరంలో అగాపే ఉజ్జీవ సభలు నిర్వహించడానికి పెద్దలు నిర్వహించారు. అరకులోయ అగాపే ఏరియా సూపరిడెంట్ ఎస్ జాన్ పాస్టర్స్ ఆధ్వర్యంలో అగాపే ఉజ్జీవ సభలు ఈ నెల 5,6,7 తేదీలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అయి మధ్యాహ్నం వరకు కొనసాగుతున్నట్లు వారు తెలిపారు. ఈ ఉజ్జీవ ప్రార్థన సభకు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు అందరూ పాల్గొని దేవుని మహిమ పరచి వాక్యము ద్వారా ఆశీర్వాదం పొంది దైవ సేవకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రసంగికుడు డాక్టర్ బిషప్ జాన్ గొల్లపల్లి, డైరెక్టర్ తిమోతి, జాన్ గొల్లపల్లి వారి బృందం హైదరాబాద్ నుండి రానున్నట్లు అరకులోయ అగాపే దైవసేకులు తెలియపరిచారు. కార్యక్రమంలో అగాపే పాస్టర్స్ విశ్వాసులు పాల్గొంటారని తెలిపారు.

సైకాలజీ అధ్యాపకునికి పురస్కారం

విశాలాంధ్ర-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ప్రథమ వార్షికోత్సవం, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, శతాధిక గ్రంథ కర్త శ్రీపదాల రామారావు 18వ స్మారకోత్సవం ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజమండ్రిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా. కర్రి రామారెడ్డి గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘ సేవకులకు, సాహితీ వేత్తలకి పదాల స్మారక పురస్కారాలని అందించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల, రంపచోడవరం సైకాలజీ అధ్యాపకుడు కంఠంరెడ్డి సోమశేఖర్‌ని పదాల స్మారక పురస్కారం తో ఘనంగా సత్కరించారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో చేసిన సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కృషి అలాగే ఉన్నత విద్య పూర్తిచేసి పౌరాణిక కళాకారునిగా కొనసాగడం వంటి విషయాలను దృష్టిలోనికి తీసుకొని సోమశేఖర్‌కి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పదాల వీరభద్రరావు సారథ్యంలో నిర్వహించడం జరిగింది. పురస్కార గ్రహీతను డి. ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.చినబాబు, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలు మారేడుమిల్లి, రంపచోడవరం ప్రిన్సిపాల్స్ అరుణ కుమారి, విఠల్, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు ప్రసంశించారు.

బంగారమ్మ తల్లి నూతన ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మునిసిపల్ బెలగాం బురాడవీధి 15, 18, 19 వార్డులలో గ్రామదేవత బంగారమ్మ తల్లి నూతన ఆలయ ప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఉమ్మడి పార్టీల అభ్యర్థి బోనెల విజయ చంద్ర గురువారం ఆలయాన్ని సందర్శించి తల్లి దీవెనలు తీసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



విశాలాంధ్ర-వి.ఆర్.పురం : రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామగిరి గ్రామంలో వెలసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం పేరుకి ప్రముఖ పుణ్యక్షేత్రమైనా ఆలయానికి వెళ్లే రోడ్డు అధ్వానం గా ఉందని రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములకల సాయికృష్ణ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తారీఖున శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శనం చేసుకోవడానికి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. అదేవిధంగా వారం రోజులపాటు సాంప్రదాయ పద్ధతిలో సేవలు అనేక కార్యక్రమాలు జరుగుతాయనీ వాటికి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారని భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా రేఖపల్లి నుండి శ్రీరామగిరి వెళ్లే రోడ్డు చాలా వరకు గుంతలు పడి అధ్వాన పరిస్థితిలో ఉన్నదని,శ్రీరామనవమి సందర్భంగా వారం రోజుల ముందు నుండే ఆ దారిగుండా అధిక సంఖ్యలో వాహనాలు తిరుగుతాయనీ,అధిక రద్దీ కారణంగా ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ముఖ్యంగా రోడ్డు మరమ్మతులు చెయ్యాలని,అలానే నవమి, దొంగల దోపిడీ రోజున వాహనదారులు అతివేగంగా వాహనాలు నడుపుతారానీ వీటిపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు మండల అధికారులను, పోలీసు అధికారులను కోరడ మైనదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు బాగుల ప్రమీల, మండల ప్రధాన కార్యదర్శిలు కోట్ల రామ్మోహన్ రెడ్డి, చోడె గంగాధర్, మండల యూత్ లీడర్ పెడపెట్ల పవన్ కళ్యాణ్ ,మండల కార్యదర్శులు బాగుల అంజనరావు, పసుపులేటి నవీన్, మండల సహాయ కార్యదర్శులు ముంజపు శ్రీరామ్,కోట్ల రాజిరెడ్డి, పాయం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ చైతన్యంపై కళ జాత

విశాలాంధ్ర-మారేడుమిల్లి : స్థానిక సచివాలయం వద్ద ఓటర్ల చైతన్యంపై గురువారం తహసీల్దార్ ఏ. వెంకటరమణరావు ఆధ్వర్యంలో కళ జాత నిర్వహించారు. కళ జాత ద్వారా ఓటు యొక్క ప్రాముఖ్యత వివరిస్తూ, ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించు కోవాలని,ఓటు లేని వారుఓటు నమోదు కేంద్రంలో నమోదుచేయించు కోవాలని.80 సంవత్సరాలు దాటిన వృద్ధులు ఇంటి వద్ద నే ఓటు వేసే సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని, స్వేచ్ఛ గా ఓటు హక్కు వినియోగించు కోవాలని పలు అంశాలపై కళాజాత నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ ఏసుబాబు, సర్వేయర్ సురేష్ రెడ్డి,సచివాలయసిబ్బంది కళ జాత రాజమండ్రి వారి విభూతి బ్రదర్స్ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఐవివి ప్రసాద్‌కి, బిజెపికి సంబంధం లేదు-బీజేపీ

విశాలాంధ్ర-వి.ఆర్. పురం : మండలానికి చెందిన ఐవివి ప్రసాద్ ఎన్‌డిఏ 11 మండలాల కోఆర్డినేటర్ గా తనను భారతీయ జనతా పార్టీ నియమించినట్లు ప్రకటించడం వాస్తవం కాదనీ బిజెపికి ప్రసాద్ కి ఎటువంటి సంబంధం లేదంటూ ఆ పార్టీ మండల కన్వీనర్ ముత్యాల రాంబాబు మండల ప్రధాన కార్యదర్శి ఊయక రత్తయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రసాద్ బిజెపి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తూ ఉంటే అతన్ని మండల పార్టీ తొ పాటు పార్టీ బాధ్యతలను దూరం పెట్టడం, అతన్ని ఎప్పుడో దూరం పెట్టగా, ఇప్పుడు ఎన్ డి ఏ కోఆర్డినేటర్ అంటూ ప్రసాదు పత్రికల ప్రకటనలో ఇవ్వడం తీవ్రంగా ఖండిస్తున్నాం. అని అన్నారు ఈ కార్యక్రమంలోభారతీయ జనతా పార్టీ , జిల్లా కమిటీ సభ్యులు కడుపు వెంకటరమణ కడుపు రాజు, తుర్రం ఆదినారాయణ, సన్యాసి మల్లయ్య, ఉయిక శంకర్, కండెల శివ, మడకం జానీ, సోది నాగేశ్వరావు, మహిళా నాయకురాలు బుర్ర కామేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

టీడిపి సీనియర్ నాయకులు మృతి

విశాలాంధ్ర-ఎటపాక : యటపాక మండలం తోటపల్లి గ్రామంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు యాసాని హరినాథ్ బాబు గారు అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. తెలుగుదేశం పార్టీ త్రిపురపెంటవీడు సర్పంచ్ మోసం రాజులు, తోటపల్లి గ్రామ అధ్యక్షులు వల్లభనేని రమేష్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని చందు, గ్రామ నాయకులు నలజాల ప్రసాద్, కొట్టేబాబు, నలజాల కోటి తదితరులు నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి నీ తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆర్థిక 'చేయూత'

చేయూత ట్రస్ట్ చైర్మన్ రమణ

విశాలాంధ్ర-చింతపల్లి : దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెల ఆర్థిక "చేయూత" ను అందించడం జరుగుతుందని చేయూత వారియర్స్ ట్రస్ట్ చైర్మన్ దూనబోయిన రమణ అన్నారు. చింతపల్లి గ్రామానికి చెందిన సాయి నగర్ లో నివాసం ఉంటున్న కిల్లో చంద్రమోహన్ నాయుడు, అదేవిధంగా అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న గంట్యాడ చంటిబాబులు గత కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారి అనారోగ్యం కారణంగా ఆ కుటుంబాలు మానసికంగానే కాక ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న రమణ ట్రస్ట్ సభ్యులతో చర్చించి ఆ కుటుంబాలను తమ ట్రస్టు ద్వారా ఆదుకోవాలని సంకల్పించారు. అందులో భాగంగా ప్రతి నెల చిరు ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఆ రెండు కుటుంబాలకు ట్రస్టు సభ్యులతో కలిసి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రమణ మాట్లాడుతూ కిల్లో చంద్రమోహన్, గంట్యాడ చంటిబాబులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నందున ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందిని కొంతమేరకైనా తీర్చాలి అనే సంకల్పంతో తమ ట్రస్టు ద్వారా ఆ కుటుంబాలకు ప్రతినెల చెరో వెయ్యి రూపాయల ఆర్థిక "చేయూత":ను అందిస్తున్నామన్నారు. దాతల సహాయ సహకారాలతో ట్రస్టు ద్వారా నిరుపేదలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సేవ చేయడం సంతృప్తికరంగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇమ్మంది మోదగిరి, షేక్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-మారేడుమిల్లి : స్థానిక గురుకుల పాఠశాలలో మూడవ తరగతి చదువు తున్న బోదులూరు సుందర్ రెడ్డి విద్యార్థి బుధవారం తోటి విద్యార్థులతో స్నానం చేస్తుండగా ప్రమాద వసత్తు కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం అవ్వడం అపస్మారక స్థితిలోకి వెళ్లడం తో పాఠశాల సిబ్బంది హుటా హుటి న ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిఎచ్‌కు తరలించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వలనే పదే పదే ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులకు మీడియాకు తెలియకుండా యాజమాన్యం జాగ్రత్త పడుతున్నారంటు విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేజీబీవీలో పర్యావరణ ఆవశ్యకతపై అవగాహన

విశాలాంధ్ర-సీతానగరం: పర్యావరణం ఆవష్యకతను ప్రతీ ఒక్కరూ తెలుసుకొని పర్యావరణాన్ని రక్షించాలని పలువురు తెలిపారు.మండలంలోని జోగింపేట కేజీబీవీ వేదికగా దీనిపై గురువారం వర్క్ షాప్ నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, వక్తృత్వ పోటీలు, స్లొగన్స్ పోటీలు, ఎకో ఫ్రెండ్లీ రంగులతో రంగోళీ పోటీలు నిర్వహించారు. పర్యావరణాన్ని పాడుచేస్తున్న మనమే తగినరీతిలో బాగుచేసుకోవాలని చిన్నారులు ప్రదర్శించిన నాటిక చూపరులను ఆకట్టుకుంది. ఉపాధ్యాయులతో సహా అందరూ ర్యాలీలో భాగస్వామ్యం వహించి, చిట్టి మెదడులకు సృజనాత్మక ఆలోచనలను రికేత్తించారు. స్థానిక సైన్స్ క్లబ్ "వింగ్స్ టూ ఫ్లై "మెంబెర్స్ పర్యావరణ పరిరక్షణకై పాటలు పాడారు. అన్ని అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో నేషనల్ సైన్స్ కోర్ జిల్లా కోఆర్డినేటర్ జి రాజారావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్య, పాఠశాల సిబ్బంది పెదప్రోలు శైలజ తదితరులు పాల్గొన్నారు

బెన్నవరం సచివాలయంలో పెన్షన్ లబ్ధిదారులకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-చింతపల్లి : పెన్షన్లు పంపిణీ విషయంలో అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఆడుతున్న క్రీ నీడలో సమిదలుగా మారి గడచిన నాలుగు రోజులుగా పెన్షన్ల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, వంటరి మహిళలకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలోని బెన్నవరం పంచాయతీ సచివాలయ కన్వీనర్ బచ్చల రమణమ్మ చల్లని మజ్జిగ అందించారు. క్రిందటి నెల వరకు ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి నెల ఒకటవ తారీఖు నుండి 5వ తారీఖు లోపు పెన్షన్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసే ప్రక్రియ జరిగేది. ప్రస్తుతం ఎన్నికల నియమావళి లోకి రావడం, వాలంటీర్లు ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో వాలంటీర్లు పెన్షన్ల పంపిణీలో పాల్గొనే పరిస్థితి లేదు. దీంతో ఈనెల పెన్షన్ లబ్ధిదారులు సచివాలయాలకే వచ్చి పెన్షన్లు అందుకునే పరిస్థితి వచ్చింది. దీనికి తోడు వేసవికాలం కావడం, వృద్ధులు, వికలాంగులు సచివాలయాల చెంతకు నడిచి వస్తున్న క్రమంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకూడదనే సంకల్పంతో సచివాలయ కన్వీనర్లు పెన్షన్ లబ్ధిదారులకు చల్లని మజ్జిగ అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకుడు బచ్చల బొజ్జన్న దొర, వైకాపా నాయకులు పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.